# శివుణ్ణి కుట్టిన చీమ

ఇసుకపల్లి దక్షిణామూర్తి

1934, జనవరి 16న బందరులో పుట్టారు. భౌతిక శాస్త్ర పట్టభద్రులై ఏజీ ఆఫీస్‌లో ఉద్యోగం చేశారు. హైదరాబాద్ ఏజి ఆఫీసులో "రంజని సాహితీ" సంస్థ ఆవిర్భావానికి కారకులయ్యారు. తన యిరవయ్యోవ ఏట కథలు రాయడం ఆరంభించారు. "బ్రతుకుబాట" నవల వీరికి మంచిపేరు తెచ్చిపెట్టింది. ఆనాటి అన్ని ప్రముఖ పత్రికలలో వీరి కథలు విరివిగా వెలువడి, పాఠకులను అలరించారు. దక్షిణామూర్తి శిష్యులు వీరి కథలలోంచి 33 కథలను సంపుటిగా యిటీవలే వెలువరించారు. ఇంకా పుస్తకాలుగా రావల్సినవి ఎన్నో వున్నాయి. భాష, శిల్పం అన్నింటిలో ఆయన దారి ప్రత్యేకం. వీరి అన్న ఇసుకపల్లి లక్ష్మీనరసింహ శాస్త్రి సుప్రసిద్ధ రచయిత. డెబ్భైయవ పడిలో వున్న దక్షిణామూర్తి హైదరాబాద్‌లో ఒక వృద్ధాశ్రమంలో ప్రశాంత జీవితం గడుపుతున్నారు. ఈ కథ 1971లో ఆంధ్ర ప్రభ వారపత్రికలో వెలువడింది. వీరి కథా సంపుటి (రూ.125/-) అన్ని బుక్ షాపులలోనూ లభిస్తుంది.

పార్వతికి నిద్రపట్టడం లేదు. పొత్తిగుడ్డల్లో పసికందు అటూ ఇటూ కదులుతూ తన ఉనికిని జ్ఞాపకం చేస్తూంది. పురిటికి గవర్నమెంట్ ఆసుపత్రికి రావటం ఇష్టంలేదు పార్వతికి. పది రూపాయలు ఖర్చయినా ఎక్కడన్నా మెటర్నిటీ హోమ్‌లో చేర్పించమని ఎంత గానో ప్రాధేయపడింది. ఇక్కడ భయమూ కాదు. కొత్తా కాదు. పెళ్లయిన అయిదు సంవత్సరాల్లో నాలుగోసారి ఇక్కడికి రావటం, నర్సులంతా గుర్తు పడతారు. చౌకీదారు గుర్తు పట్టుతాడు. అంతా ఎరిగిన చోటుగానే ఉంటుంది. కానీ, ఒకటే భయం. ఆసుపత్రికి వచ్చినప్పటి నుండి ఇంటికి వెళ్లేదాకా వందమందికి సమాధానం చెప్పుకోవాలి. 'ఏమండీ? ఎంతమంది పిల్లలు? ఎంతమందయితే వాళ్లకెందుకు? కనటానికి తనకు ఓపిక ఉన్నది. పెంచటానికి ఆయనకు ఓపిక ఉన్నది. 'అంతా ఆడపిల్లలేనా?' తమకు ఆడ పిల్లలయితే వాళ్లకేం? కట్నం లేకుండా పెళ్లి చేసుకోమని అడిగితే అప్పుడు ఏడవవచ్చు. కట్నం కోసం అప్పుకావాలని అడిగితే అప్పుడు జాలి పడవచ్చు. ఈ మాటలన్నీ భరిస్తుంది. అక్కడితో ఊరుకోరు ఆసుపత్రి జనం. 'ఆపరేషను చేయించుకుంటున్నారా?' అని ఒకరు, 'డబ్బు కూడా ఇస్తారు' అని ఒకరు. చివరిమాట వింటూనే పార్వతి భగ్గున మండిపోతుంది. 'డబ్బు ఇస్తే మీరు ఆపరేషన్ కాదు, ఇంకేమయినా కూడా చేయించుకుంటారు' అనాలన్నంత ఆవేశం, ఉక్రోషం వస్తుంది. ముక్కు ముఖం ఎరగని వాళ్లతో తగాదాపడి ఏమిటి సాధించేది? ఆసుపత్రిలో చేరినప్పటి నుండి 'ఆపరేషను... ఆపరేషను... ఆపరేషను...' అందరూ ఇదే స్మరణ. ఇంతకంటే 'నారాయణ... నారాయణ...' అనుకున్నా సగం కష్టాలు గట్టెక్కుతాయి వాళ్ళకు అనుకుంది పార్వతి.

పార్వతి పక్కకు తిరిగి పసికందుకు పాలిస్తూంది. పాప పాలు అడగనే లేదు. ఆపరేషను మాట గుర్తు వచ్చినప్పుడల్లా వెన్నుజిల్లుమంటూ చల్లగా మంచు

ఆణిముత్యాలు

యుగంలాగా అయిపోతుంది - ప్రళయం వచ్చేస్తున్నట్టు, సృష్టి అంతా ఆగిపోతున్నట్లు. సృష్టి ఆగిపోకుండా ఈ భూమి మీద మనుగడ సాగాలి అంటే దాని కీలకం తన చేతిలో ఉన్నది. పాపను దగ్గరగా గుండెలకు హత్తుకుని పాలిస్తుంటే ఈ చరాచరా సృష్టి కంతటికి తను తల్లి అయినట్లూ, పాలిచ్చి పెంచుతున్నట్లూ గుండెల్లో వెచ్చని రక్తం ప్రవహించి, శరీరం వేడెక్కి గగుర్పాటు కలుగుతుంది. తొట్రుపాటు వస్తుంది. విడిగా నర్సింగ్ హోమ్‌లో అయితే, ఆపరేషను సంగతి అడిగితేనే కాని చెప్పరు.

పార్వతి మళ్లీ కాస్త నిద్ర వస్తుందేమోనని కళ్లు మూసుకుని ఆశగా చూసింది. నిద్రకు ఆశ ప్రతి బంధకం. పురుళ్ల ఆసుపత్రిలో ప్రశాంతత కోరుకోవటం... పార్వతికే నవ్వు వచ్చింది. పసి పిల్లలంతా పగలు

నిద్రపోయి, రాత్రిళ్లు ఏడుస్తారు. తల్లికి విసుగు ఉన్నదా లేదా పరీక్షిస్తారట పిల్లలు పుట్టగానే. నిద్ర వస్తే బాగుండును. క్యారు క్యారుమని నాలుగు పక్కల నుండీ ఏడుపులు. దానికి కొంతవరకు అలవాట యింది. బలవంతాన నిద్రపోతున్నట్టు కళ్లు మూసు కుంది. ఉన్నట్లుండి వరండాలో హడావిడి మొద లయింది. ఆగకుండా గంట. నర్సు హడావిడిగా పరు గెత్తటం, చక్రాల కుర్చీలో ఆమెను తీసుకు వస్తున్నారు. ఒకటే ఆగం చేస్తూంది. 'నేను బతకనురో... దేముడా... ఆ చచ్చినాడు ఎక్కడకు పోయాడే... అమ్మో... ఇంక బతకను...' నర్సులు నవ్వుకుంటున్నారు. వయసు మళ్లిన నర్సు ఒకతె కొద్దిగా గదమాయించి, "ఇప్పుడి ట్లాగే గోల పెడతారు... హు" అంటూ గొణిగింది. కుర్చీలో మనిషి కోరగా ఆమె వంక చూసి "వద్దంటే విన్నాడు కాదు.. తల్లీ, ఆ ముదనష్టపోడు... అయ్యో...." అంటూ శ్రుతి పెంచుతూంది. పార్వతి మెల్లగా మంచం మీద లేచి కూర్చుని, చెప్పుల కోసం అటూ ఇటూ చూసింది. రెండో చెప్పు కనిపించలేదు. జతగా ఉంటేనే ప్రయాణానికి వీలు భార్యాభర్తల్లా, గోపాలం ఇంటి దగ్గర ఏమనుకుంటున్నాడో పార్వతికి తెలుసు... తెలియదు. సాయంత్రం ఆరుగంటలకు ఆసుపత్రి నుండి వెళ్లే ముందు అతనితో ఒంటరిగా మాట్లాడాలనుకుంది. అత్తగారు, ఆడపడుచు, తోడి కోడలు ఉన్నారు. పార్వతికి దుఃఖం వచ్చింది.

తను ఒంటరిగా భర్తతో మాట్లాడాలంటే అన్నీ ఆటంకాలే. ఇప్పుడే కాదు, పెళ్లి అయినప్పటి నుండీ. పదిమంది మధ్య తను ఒకతె. తను ఇంటికి రాణి కాదు. నౌకరు కాదు. తను ఏమీ కాదు. ఆ జనాభా లెక్కలో తను ఒక అంకె. గోపాలంతో అదివరకు సూటిగా చెప్పలేకపోయినా, చూచాయిగా హెచ్చ రించింది - 'ఒంటరిగా ఎక్కడికన్నా వెళ్లివద్దామండీ...' అని. గోపాలం నవ్వేసి ఊరుకునేవాడు. 'ఇక్కడ ఒంటరి తనం దొరకటం లేదా!' అని చిలిపిగా చూసేవాడు. ఈ మాట అత్తగారి చెవికి ఎట్లా చేరిందో ఆవిడ అనే సింది. 'స్వేచ్ఛ... స్వేచ్ఛ... అంటారు.. ఏ స్వేచ్ఛా లేకుండా పిల్లల్ని కంటున్నారేమిటే ఈ కాలపు వాళ్లు....' అత్తగారు ఉడికిస్తున్నా ఒక్కొక్కసారి ఏడిపి స్తున్నట్లు ఉంటుంది. ఆరయింది. గంట కొట్టగానే అందరితో పాటు గోపాలం బయలుదేరాడు. పార్వతి అతని కళ్లలోకి సూటిగా చూసింది. ఏదో తను చెప్పాలన్న తహతహ.... ఇంతమంది మధ్య చెప్పలేనన్న బాధ. గోపాలం మెల్లిగా అందరితోపాటు గేటు దాకా వెళ్లి, తల్లిచేతిలో ఫ్లాస్కు పెట్టి, "నడుస్తూ ఉండండి... ఇప్పుడే వస్తాను" అన్నాడు. "పోయి రహస్యాలేమన్నా మాట్లాడి రావాలి...." అన్నది తల్లి. తల్లికి ఏదన్నా గట్టిగా సమా ధానం చెప్పాలనిపించింది గోపాలానికి. సమాధానాలు లేక కాదు. ప్రతి ప్రశ్నకు ఒక సమాధానం ఉన్నది. అవన్నీ నోటిదాకా వచ్చి ఆగిపోతాయి. సమాధానం చెప్పకుండానే వార్డులోకి వెళ్లాడు. పార్వతి ముఖం విప్పారింది. చౌకీదారు 'టైము' అయింది... వెళ్లండి సార్...." అంటున్నాడు.

"చెప్పు.... ఏమిటి సంగతి..." అన్నాడు గోపాలం.

"కూర్చోండి.." అంది పార్వతి, మంచంమీద తను కూర్చుంటూ. గోపాలం స్టూలు మీద కూర్చుని పాప వంక చూశాడు. ఏడుపు లేదు. నవ్వులేదు. గంభీరంగా తల్లిదండ్రుల వంక చూసింది పాప.

"ఏం ఆలోచించారు..."

"దేని సంగతి?"

పార్వతి పాపను ఒళ్లోకి తీసుకుంది. ఎవరో పాపను తన ఒళ్లోనుండి లాక్కుపోతుంటే భయపడు తున్నట్లు గట్టిగా పట్టుకుంది. దుప్పటి మీదకు లాక్కున్నది. గోపాలం కళ్లలోకి చూసి, తలవంచుకుని, " ఆపరేషను సంగతి..." అంది. గోపాలానికి ఆ ప్రశ్న వస్తుందని తెలుసు. 'నీ ఇష్టం..." అన్నాడు.

"మీ ఇష్టమే నా ఇష్టం..." అంది పార్వతి. పాప గుప్పిటినుండి తన వేలిని బయటికి లాక్కుంటూ, పాప దగ్గర తాము ఈ మాటలు చెప్పుకోవటం.. ఏదో తప్పు చేస్తున్నట్లు తోచింది. పాప ముద్దాయి. తాము న్యాయనిర్ణేతలు. రానున్న పాపల జీవన్మరణ సమస్య తాము చర్చిస్తున్నారు. గోపాలం మనస్సు వికలమై పోయింది. భగవంతుడు తనకీ అధికారం ఇచ్చాడా? సృష్టిక్రమాన్ని ఆపే ప్రయత్నం తను చేయగలడా? శివుని ఆజ్ఞ లేనిదే కుట్టలేని చీమల ప్రపంచంలో తను స్వయంగా నిర్ణయం తీసుకుంటున్నాడనుకుంటే అర్థం ఉన్నదా? గోపాలానికి నవ్వు వచ్చింది. 'నువ్వు కూడా ఆలోచించు..." అంటూ గోపాలం లేచి వెళ్లిపోయాడు. నిర్ణయం వాయిదా పడినందుకు పార్వతి తృప్తి పడింది.

పార్వతికి రెండో చెప్పు కనిపించనే లేదు. వరం డాలో మళ్లీ గంట మోగింది! నర్సులు పరుగెత్తారు. బయట నాలుగైదు కార్లు కనిపిస్తున్నాయి. పదిహేను, ఇరవై మంది మనుషులు ఉన్నారు. చౌకీదార్లు, నర్సులు - అంతా నమస్కారాలు పెట్టు తున్నారు. ఎవరో పెద్ద డాక్టరు కోసం టెలిఫోన్ చేస్తున్నారు. మంచం మీద మరో ఉతికిన దుప్పటి అమరుస్తున్నారు. ఆమె మెల్లిగా, సపరివారంగా నడుస్తూంది. చక్రాల కుర్చీ... చక్రాల

టేబులు.. నర్సులు... ఆసుపత్రి అంతా అక్కడే ఉన్నది. ఇద్దరు నర్సులు అక్కడ బల్లమీద కూర్చుని పురుటి నెప్పులు పడుతున్న చింపిరిజుట్టు అమ్మాయిని రెండు చేతులతో పట్టుకుని, గబగబా నడిపించి పక్కకు తీసుకుపోయి వరండాలో ఒక మూలగా కూర్చోపెట్టారు. అక్కడ మూలగమని. మంచిపని చేయాలంటే ఈ అలగా జనం ఎప్పుడూ అడ్డమే. చిట్లించుకున్న ముఖానికి మళ్లీ నవ్వు పూసుకుని జనం మధ్యకు పోయింది నర్సు. చింపిరిజుట్టమ్మాయి మూలగటానికి భయపడి కళ్లలో నీళ్లు పెట్టుకుంటుంది. ఆ కన్నీళ్లు కిందపడితే ఆసుపత్రి శుభ్రతకు ఎంత భంగం! ఎంత ప్రమాదం!! పార్వతికి కూడా ఏడుపు వస్తూంది. ఆ అమ్మాయి కళ్లు ఎంత బాగున్నాయి! ఆ చింపిరిజుట్టు చిత్రకారుడు తీర్చిదిద్దినట్టు ఉంది. కాని కష్టాలకు ఎగిరి పోతున్నట్టు లేదు. తను ఏమీ చెయ్యలేదు. మంచం, దుప్పటి అన్నీ తన దగ్గర ఉన్నాయి. కావాలనుకుంటే అవన్నీ కొని ఇవ్వగలం ఐశ్వర్యం ఉంది తనదగ్గర. కాని వాటన్నిటినీ మించిన అసహాయస్థితి ఉన్నది. పార్వతి మళ్లీ పడుకుంది... చింపిరి జుట్టు అమ్మాయి జుట్టులా నిద్ర కళ్లమీదకు పాకింది.

అంతా కత్తులు తీసుకుని వస్తున్నారు. ఆపరేషను చేస్తాం అంటున్నారు. పక్కలో పాప కనిపించటం లేదు. చింపిరి జుట్టమ్మాయి ఏడుస్తూంది. మళ్లీ ఉలిక్కిపడి లేచింది పార్వతి. కిటికీలోంచి తొంగి చూసింది. కారులో వచ్చిన అమ్మాయి, పరుపు మీద పడి మూలుగుతూంది. మళ్లీ గంట. పోలీసులు గబగబా వస్తున్నారు. చేతిలో పిల్లలు... పసికందులు. నర్సులు వచ్చారు. పిల్లల్ని అందుకున్నారు.

"ఏమయింది?"

"ముందర పిల్లల్ని లోపలకు తీసుకువెళ్లండి..."

"కవల పిల్లలా..."

"తల్లి ఎక్కడ..."

"కనిపించడం లేదు..."

పిల్లల్ని గుడ్డలో వెచ్చగా చుట్టి, గబగబా నర్సులు తీసుకుని వెళ్లారు. పోలీసు నవ్వుతున్నాడు. "సుఖ పడేది ఒకళ్లు... కష్టపడేది ఒకళ్లు... ఎప్పుడూ ఇట్లాగే ఉంటుంది... ఈళ్ల బాబు ఎక్కడో వెచ్చగా తొంగుని ఉంటాడు. ఈ చలిలో దేవుడా అంటూ ఆసుపత్రికి వచ్చే డ్యూటీ మాకు తగిలింది."

"తల్లి ఏదీ..."

"అది కనపడితేనా... చావకొట్టి చెవులు మూసే వాడిని కాదూ... సిగదరగా... సాయంత్రం దాకా ఆ చెట్టుకింద పడి మూలుగుతూనే ఉన్నదండి... ఆసుపత్రికి చావరాదుటే అని చెప్పానండి... విని ఛస్తేగా... పైగా దాని పొగరు చూడండి... ఆసుపత్రి ఇళ్లున్న వాళ్లకి... తన్నెవరు రానిస్తారు... అందండి..."

పార్వతికి గుండెల్లో దేవినట్లయింది. లోపలకు తీసుకుని వెళ్లిన పిల్లల్ని ఎవరు పోషిస్తారు? ఇద్దరు మగపిల్లలుట. తనకు ఒక్క మగపిల్లవాడు ఉంటే ఎంత బాగుండేది. నలుగురూ ఆడపిల్లలే అయిరి.

"ఛీ... ఛీ... ఈ ఆడపిల్లలు వద్దు... ఇప్పుడే పోయి ఆపరేషను చేయించుకు వస్తే సరిపోతుంది... నర్స్... నర్స్..." మాటలన్నీ పెదిమల దగ్గరే ఆగిపోతున్నాయి. అత్తగారి మాటలు మరీ విచిత్రంగా ఉంటాయి. తన కూతురికి అంతా మగపిల్లలు. తనకు అంతా ఆడపిల్లలు. కోడలికి అంతా ఆడపిల్లలు పుడితే. తన కొడుక్కి పుట్టినట్లు కాదనేగా? కోడలి మీద కోపం వచ్చి శాపం పెడితే కొడుక్కి తగలదూ? లేకపోతే ఏమిటా మాటలు? "ఆపరేషను వద్దంటావు... ఈసారి కూడా ఆడపిల్ల పుడితే ఏం చేస్తావు?..." అని అడిగింది. తను చేయగలిగిందేమీ లేదు. కాని, మగపిల్లవాడు పుడతాడని ధైర్యం తనకు. ఉంగరాల జుట్టూ, మెళ్లో పులిగోరూ, చేతులకి మురుగులూ, మామిడి పిందెల మొలతాడూ.... చిన్న కృష్ణుడిలా చేతుల్లో వేళ్లాడుతూ, పాలిండ్లమీద కాళ్లతో తన్నుతూ ఆడుకుంటుంటే తన జీవితాని కింకేం కావాలి? తన కళ్లలో ఆ రూపం మెదులుతూనే ఉన్నది. 'అమ్మా... నేనమ్మా... కృష్ణుడిని... తలుపు తియ్యమ్మా....' అల్లరి కృష్ణుడు కిటికీలోంచి తొంగి చూస్తున్నాడు. తన కళ్ల వెంబడి నీళ్లు కారిపోతున్నాయి. గుండెలు పగిలి పోతున్నాయి. తలుపులు వేసేసింది. శాశ్వతంగా తలుపులు మూసేసింది. ఆ తలుపులు తను తియ్యలేదు. తనే కాదు, ఎవ్వరూ తియ్యలేరు. విప్పలేని ముడి తను ఎందుకు వేసింది? 'కృష్ణా... కృష్ణా... నువ్వు లేనిదే నేను బ్రతకలేను. ఈ తలుపు నేను తియ్యలేను... నేను వస్తా, కృష్ణా... ఎట్లా వచ్చేది... ఈ శరీరం మనిషి నిర్మించిన గోడల నుండి బయట పడలేదు. ఈ శరీరం వదిలేసి నీ దగ్గరకు వస్తా... కృష్ణా... కృష్ణా... కృష్ణా..."

పార్వతి ఉలిక్కిపడి లేచింది. తను బిగ్గరగా అరిచిందా?! ఎవరన్నా విన్నారా? కన్నీటి చారలు, తుడుచుకుంది. వరండాలో చింపిరిజుట్టు అమ్మాయి కనిపించలేదు. ఆత్రంగా, అటూ ఇటూ చూసింది. పురుళ్లుపోసే గదిలోకి తొంగి చూసింది. ఇళ్లున్న వాళ్లకే ఆసుపత్రి అందిట కవల పిల్లల తల్లి. చింపిరి అమ్మాయికి కూడా ఇల్లు లేదా? ఇక్కడికి ఒక్కతే వచ్చిందా! అయినవాళ్లు

ఎవ్వరూ లేరా? "నర్స్... నర్స్..." పార్వతి మెల్లిగా పిలిచింది.

"ఏమమ్మా.... నిద్ర పట్టలేదా...."

"కొద్దిగా తలనొప్పిగా ఉంది... సరేగాని, నర్స్ ఇక్కడొక అమ్మాయి ఉండేది... ఇప్పుడెక్కడున్నది..."

"పురుటి గదిలోకి తీసుకు పోయారు..."

"కొంచెం జాగ్రత్తగా చూడండి... మావారు పొద్దున్నే రాగానే పది రూపాయలిప్పిస్తాను..."

"ఎవరు... మీకు తెలిసిన అమ్మాయా...."

'ఆఁ మా పనిమనిషి చెల్లెలు...'

"అట్లాగా!!"

పార్వతి అబద్ధం మింగింది. అబద్ధాలాడకుండానే నలుగురు ఆడపిల్లల్ని కన్నది. ఇంక పోయేదేమీ లేదు. పార్వతి నవ్వుకుంది.

నిద్రలేక కళ్లు మండుతున్నాయి. దుప్పటి పైకి లాక్కుంది ముఖం కూడా కనపడకుండా. నిద్ర రాదు. మళ్లీ గంట, కొత్త కేసు. మళ్లీ గంట, మళ్లీ కొత్త కేసు. రిక్షాలో రెండు కేసులు వచ్చినాయి. కారులో నాలుగు కేసులు వచ్చినాయి. బస్సులో యాభై కేసులు వచ్చి నాయి. రైలులో వెయ్యి కేసులు వచ్చినాయి. విమానం నిండా పురుడు పోసుకోవటానికి వచ్చిన వాళ్లు ఆసుపత్రిలో దిగటానికి చోటులేక ఆసుపత్రి పైన ఆకా శంలో పల్టీలు కొట్టుతున్నారు. అంతా గందర గోళం, ఆసుపత్రి నిండి పోయింది. పురుటి గదిలోకి వెళుతు న్నారు... వస్తున్నారు. ఏడుస్తూ లోపలకు పోయి, నవ్వుతూ పిల్లల్ని చంకన పెట్టుకువస్తున్నారు. చంకల్లో పిల్లలు అప్పుడే చూస్తుండగానే కిందికి దిగి నడుస్తు న్నారు. పెరిగి పెద్దవాళ్లయి పోతున్నారు. మగ పిల్ల లంతా బయటకు పోతున్నారు. ఆడపిల్లలు మళ్లీ ఏడుస్తూ పురుటిగదిలోకి పోయి, నవ్వుతూ పిల్లల్ని ఎత్తుకు వస్తున్నారు. పిల్లలు చూస్తుండగానే మళ్లీ పెద్దవాళ్లయి పోతున్నారు. మళ్లీ పురుటిగదిలోకి... జనం క్రిక్కిరిసి పోతున్నారు. తన గదినిండా వాళ్లే. మంచం మీద, పక్కన, కింద – ఎక్కడపడితే అక్కడే. రైళ్లు నిండిపోయాయి. రైలెక్కినవాళ్లు ప్లాటుఫారం మీద – వాళ్లని పైకి రాకుండా తోసేస్తున్నారు. వాళ్లంతా ఒకటి... వీళ్లంతా ఒకటి. రైలు తలుపులన్నీ ఆసుపత్రి ఆపరేషను కత్తులతో మూసి వేస్తున్నారు. ఆకలి.. ఆకలి... వరి పైరు కాకుండానే కంకులు తినేస్తున్నారు. గడ్డి తినేస్తున్నారు. మళ్లీ నారు చల్లుదామంటే విత్తనాలు లేవు. అవి కూడా తినేశారు. తినడానికి పనికి వచ్చే ఆకు అలములతో పాటు ప్రాణికోటిని కూడా తినేస్తు న్నారు. అంతా అయిపోయింది. మనుషులే మిగిలి పోయారు. ఒకరిని మరొకరు తినాలి. ఎవరు, ఎవర్ని? బలవంతుడు బలహీనుణ్ణి. బలాబలాలు తేల్చుకుంటు న్నారు. కొంతమంది రాకెట్లు ఎక్కి ఇతర గ్రహాల్లోకి పారిపోతున్నారు. పోలీసులు రోడ్ల మీద నుంచి తప్పు కున్నారు. ఆ జన సముదాయం ఎటు నుంచి వస్తుందో, ఎటు పోతున్నదో, గమ్యమేమిటో, ఉద్దేశమేమిటో తెలియదు. భగవంతుడు పోలీసు వేషం వేసుకుని ఆకాశంలో నిలబడి – 'ఆగండి... ఆగండి..' అని అరుస్తున్నాడు. 'కిందికి దిగిరా... నీ పని చెపుతా...' అంటున్నారు జనం. పార్వతికి తన పిల్లలు కనిపించ దం లేదు. 'ఏమండీ.. ఏమండీ... పిల్లలు కనిపించటం లేదండీ..' పార్వతి కంగారుగా లేచింది. పాప పొత్తిళ్లలో నిశ్చలంగా నిద్రపోతూంది. పురుటి గదిలో క్యారు మంటూ ఏడుపు వినిపిస్తూంది. కళ్లు తుడుచుకుని, పార్వతి మంచం దిగి బయట ప్రశాంత వాతావరణం లోకి తొంగి చూసింది. వరండాలో చాలా మంది చాపలువేసి పడుకున్నారు. అందులో ఒకామె పార్వతి వంక చూసి బాధగా నవ్వింది. కానుపు అంటే చచ్చి బ్రతకటం. మరొక జన్మ. తను నది దాటి, ఒడ్డున ఉన్నది. ఆమె ఆవలి ఒడ్డున నది దాటటానికి భయ పడుతూ నిలబడి ఉన్నది. పార్వతి ప్రసన్నంగా ఆమె వంక చూసి నవ్వింది. గుండెల మీద నుంచి ఏదో బరువు తీసినట్లుగా ఉంది. కాని, కల ఇంకా భయం కరంగానే గుర్తుకు వస్తూంది. నిజంగా ఒకనాటికి ఈ భూమి అంతా జనంతో నిండిపోతుందా? ఆ ఆలోచ నతో మళ్లీ తలనొప్పి మొదలయింది. ఆపరేషను చేయించుకుంటే సరిపోతుందా? గోడమీద పటంలో నుండి కృష్ణుడు చేతులు చాచి, 'అమ్మా... అమ్మా...' అని పిలుస్తున్నాడు.

గోపాలం పొద్దున్నే కాఫీ పట్టుకుని వస్తాడు. తను ఏ నిర్ణయానికి వచ్చాడో? తన మాదిరిగానే రాత్రంతా ఆవేదనతో పలవరింపులతో గడిపాడా? ఏమో... భర్త ఇష్టప్రకారమే పోతుంది. ఈ నిర్ణయంలో తను బాధ్యత తీసుకోలేదు. తను పిరికి మనిషి. విజ్ఞాన హీనురాలు. పార్వతి తన్ను తాను తిట్టుకుంది. ఆపరేషన్ చేయించు కుంటే ఆసుపత్రిలో ఉండాలి. లేకపోతే తను వెంటనే ఇంటికి వెళ్లిపోవాలి ఆరోజు. ఆ మంచం చింపిరి జుట్టు అమ్మాయికి ఇస్తారా? ఇళ్లు లేని వాళ్లకి ఆసుపత్రి లేదు. పైగా మంచం కూడానా? పార్వతి నవ్వుకుంది.

బయటి చీకటి, "నర్స్... నర్స్..."

"ఏమమ్మా...."

"ఎందుకో భయంగా ఉన్నది... కాసేపు దగ్గర

కూర్చుంటావా, సరళా... నీ పేరు సరళే కదూ..."

"అవును. భయం ఎందుకు?"

"కలలొస్తున్నాయి...?"

"మీబోటి వాళ్లు కాక మేము కలలు కంటామా, అమ్మా..."

"అదేమిటి అట్లా మాట్లాడుతున్నావు"

"కలలు కన్నా, కలలు నిజం చేసుకున్నా... అందరికీ వీలయే పనికాదు... అందుకని..."

పార్వతి విచిత్రంగా చూసింది. సరళ కళ్లలో ఒక్కసారిగా నీళ్లు పొంగాయి.

"అబ్బే... ఏం లేదు... ఏం లేదు..." రుమాలుతో కనీళ్లు తుడుచుకుని నవ్వు తెచ్చుకుంటూ అంది సరళ. " ఇంతకీ ఏం కలలు వచ్చినాయి..."

"నువ్వు ఎందుకలా ఉన్నావో చెప్పవా..." పార్వతి సరళ గడ్డం పట్టుకుని అడిగింది. సరళకు మళ్లీ దుఃఖం వచ్చింది.

"అంతా మన చేతుల్లో ఉందనుకుంటాం కాని, మన చేతుల్లో ఏమీ లేదు..."

"ఏమయింది ఇప్పుడు..."

"ఇప్పుడేదో అయిందని కాదు. ఈ నర్సుగా చేరినప్పటి నుంచి చూస్తున్నాను. ఈ చేతులమీదుగా ఎంతమందిని ఈ లోకంలోకి తీసుకుని వచ్చానో... ఎంతమందిని ఈ చేతులమీదుగా మరో లోకానికి పంపానో..."

"మరో లోకం ఉందంటావా, సరళా?"

సరళ ఎదురు ప్రశ్న వేసింది: "అసలు దేవుడున్నాడా... అని అడిగావు కాదు."

"నిజంగా ఉన్నాడంటావా..." పార్వతి తల ఎత్తకుండానే అడిగింది.

సరళ – "ఏమో నాకు మటుకు ఏం తెలుసు... జనన మరణాలు నిత్యం చూస్తున్న నాకు... ఆ ప్రశ్న ప్రతి నిత్యం నన్ను వేధిస్తూనే ఉన్నది. కాని కొత్త ప్రాణిని చూసినప్పుడు సంతోషం ఆపుకోలేను... ఒక్కోప్రాణి మనం చేసిన ప్రయత్నాలన్నీ విఫలం చేసి వెళ్లి పోయినప్పుడు దుఃఖం ఆపుకోలేను... ఇవన్నీ అనుక్షణం నాకు తెలియని భగవంతుణ్ణి జ్ఞాపకం చేస్తూనే ఉంటాయి.

"మన చేతిలో ఏమీ లేనప్పుడు... ఈ ఆపరేషను చేయించుకోవటం ఎందుకు అనుకోకూడదు?" సరళ ఎదురు ప్రశ్నించింది.

పార్వతి మళ్లీ ఆలోచనలో పడింది. ఇంకా తెల్లవారటానికి చాలా పొద్దు ఉంది. సరళ లేచి నిలబడింది. చింపిరి జుట్టు అమ్మాయికి ఎట్లా ఉన్నదో? తను పది రూపాయలు ఇస్తానన్నది. ఆపరేషన్ చేయించుకుంటే ఇంకా ఎక్కువ డబ్బే ఇస్తారు. అదంతా ఆ చింపిరి అమ్మాయికి ఇస్తే చీరె వస్తుంది. ఆ పాడు డబ్బు ఇంటికి తీసుకుని వెళ్లకూడదు. తనకు అప్పుడే ఆపరేషను అయిపోయినట్లు, డబ్బు వచ్చినట్లు.. ఏమిటి ఈ పిచ్చి ఆలోచనలూ?

"ఆ అమ్మాయికి ఎట్లా ఉన్నది..."

సరళ ఎటో చూస్తున్నది.

"ఇంకా కాన్పు కాలేదా..."

"అయింది..."

"ఏం పిల్ల..." పార్వతి ఉత్సుకత నాపుకోలేక పోయింది.

" ఇద్దరు మగపిల్లలు..."

"ఆఁ... నిజంగా... నేను చూడొచ్చా ఇప్పుడు? చూడు సరళా... పొద్దునే మా వారు రాగానే పది రూపాయలిప్పిస్తాను. ఇంటి నుండి చీరె కూడా ఒకటి తెప్పించి ఇస్తాను ఆ అమ్మాయికి..." పార్వతి తన్ను తాను నిందించుకుంది. తను రాకపోతే అట్లాంటి అమ్మాయికి మంచం దొరికేదేమో! ఎట్లా ఉందో, ఏమిటో? ఎక్కడ పడుకోపెట్టారు. ఛీ... ఈ పురుళ్లింక చాలు. ఆ అమ్మాయి ఎవరని తనింత ఆవేదన పడుతూందో పార్వతికి అర్థం కాలేదు.

"ఏం సరళా. చెప్పు.... నేనొక్కసారి చూసొస్తాను.. మా పాపదగ్గర ఉందువుగాని కొంచెం సేపు..." సరళ గౌను పట్టుకుని లాగుతూ అడిగింది. సరళ కదలడంతో చెదిరిన కన్నీటి చుక్కలు పార్వతి చేతిమీద పడ్డాయి. ఉలిక్కిపడింది పార్వతి. గుండె ఒక్కసారి ఆగినట్లయింది.

"మన అవసరం లేనిచోటికి వెళ్లిపోయింది ఆ అమ్మాయి..." సరళ కళ్లలో నీళ్లు అయిపోయినాయి. ఎర్రగా ఉన్నాయి కళ్లు.

"ఊరుకో..." సరళతో ఆ మాట అంది కాని పార్వతి తనని తనే ఓదార్చుకుంటున్నది

"మీరు అబద్ధం చెప్పారు... ఆ అమ్మాయి మీ పనిమనిషి చెల్లెలు కాదు..."

"నా శాంతి... నా బాల్య స్నేహితురాలు శాంతి ... కాదు... నేనే ఆ చింపిరి జుట్టు అమ్మాయిని... దగాపడ్డవాళ్లందరూ నేనే... ఆ అమ్మాయి నేనే..." సరళ రేగిన జుట్టు సవరించుకుంటూ విసవిసా నడిచి పోయింది.

పార్వతి నిర్ఘాంతపోయింది. "జన్మలో ఆసుపత్రికి మళ్లీ రాకూడదు" అనుకుంది. ■